
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024

జిల్లాలో మొత్తం ఓటర్లు: 17.79 లక్షలు

పురుషులకన్నా ఎక్కువున్న మహిళా ఓటర్లు: 42324

2019 తర్వాత పెరిగిన ఓటర్లు : 67675



అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం : చంద్రగిరి(308916)

అత్యల్పంగా ఉన్నది : సత్యవేడులో (211378)

అత్యధికంగా పెరిగిన ఓటర్లు : తిరుపతి(27477)

ఓటర్లు తగ్గిన నియోజకవర్గం : వెంకటగిరి(1064)

దొంగ ఓట్లు సంగతేం చేశారు?

దొంగ ఓట్ల గోల జిల్లాలో హోరెత్తుతున్న నేపథ్యంలో తుది ఓటరు జాబితా సోమవారం విడుదలైంది. వైసీపీ నేతలు జిల్లాలో అనేక దొంగదారుల్లో ఓట్లు నమోదు చేయించారనీ, ప్రత్యర్థుల ఓట్లు తీసేయించారని ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాలమీదే ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. చంద్రగిరిలోనే లక్షకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో విడుదలైన తుది ఓటర్ల జాబితాను బూత్ లెవల్‌లో పరిశీలించిన తర్వాత విపక్షాలు ఎలా స్పందిస్తాయో చూడాల్సి ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తుది ఓటరు జాబితా విడుదల
- ముసాయిదాపై ఫిర్యాదులు పరిష్కరించారా?
- బీఎల్ఏల పరిశీలన తర్వాతే నిగ్గుతేలే అవకాశం

67675మంది ఓటర్లు పెరిగారు

సోమవారం విడుదలైన తుది ఓటర్ల జాబితా మేరకు జిల్లాలో మొత్తం 17.79 లక్షల మంది ఓటర్లు వున్నారు. అందులో పురుష ఓటర్లు 8.68 లక్షలు కాగా మహిళా ఓటర్లు 9.10 లక్షలు, ఇతరులు 188 చొప్పున వున్నారు. పురుషుల కంటే 42324 మంది మహిళా ఓటర్లు జిల్లాలో అధికంగా వున్నారు. జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 3.08 లక్షల మంది ఓటర్లు వుండగా అత్యల్పంగా సత్యవేడు నియోజకవర్గంలో 2.11 లక్షల మంది ఓటర్లు వున్నట్టు జాబితా వెల్లడిస్తోంది. 2019 ఎన్నికల నాటితో పోలిస్తే జిల్లాలో ఓటర్ల సంఖ్య 67675 పెరిగింది. తిరుపతి సెగ్మెంట్‌లో అత్యధికంగా 27477మంది ఓటర్లు పెరగగా వెంకటగిరి సెగ్మెంట్‌లో ఓటర్ల సంఖ్య 1064 తగ్గింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా నమోదైంది.

తిరుపతి జిల్లా ఓటర్ల తుది జాబితా

నియోజకవర్గం	2023లో పురుషులు	2023లో స్త్రీలు	2023లో ఇతరులు	2023లో మొత్తం ఓటర్లు	2019లో మొత్తం ఓటర్లు	తేడా
గూడూరు	116982	123371	35	240388	236529	+3859
సూళ్ళూరుపేట	115802	121876	22	237700	231617	+6083
వెంకటగిరి	116936	122300	04	239240	240304	-1064
చంద్రగిరి	150249	158607	60	308916	291734	+17182
తిరుపతి	148101	150100	38	298239	270762	+27477
శ్రీకాళహస్తి	117635	125546	16	243197	237666	+5531
సత్యవేడు	102568	108791	13	211378	202771	+8607
మొత్తం	868273	910597	188	1779058	1711383	+67675

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా వుండడం గమనార్హం. మహిళా ఓటర్లు ఎక్కువగా వున్న సెగ్మెంట్లలో చంద్రగిరి తొలి స్థానంలో వుంది. ఇక్కడ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 8358 మంది ఎక్కువగా వున్నారు. తిరుపతిలో కేవలం 1999 మంది మహిళలు మాత్రమే ఎక్కువగా వుండడం గమనార్హం.

అందరి దృష్టీ చంద్రగిరి పైనే!

ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదలైన నేపథ్యంలో అందరి దృష్టీ చంద్రగిరి నియోజకవర్గంపైనే కేంద్రీకృతమైంది. గతేడాది జనవరిలో మొదలై ఇటీవల ముగిసిన ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గంలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో దొంగ ఓటర్లు నమోదయ్యారని, పలు ఇతర అవకతవకలు చోటుచేసుకున్నాయని టీడీపీ బీఎల్ఏల నుంచీ టీడీపీ అధినేత చంద్రబాబు వరకూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ అయితే ఓటర్ల నమోదు అక్రమాలపై పెద్ద కసరత్తే చేశారు. ప్రత్యేకంగా సిబ్బందిని, పార్టీ నాయకులను, కార్యకర్తలను పెట్టుకుని ఒక పోరాటమే నడిపారు. తప్పుడు క్లెయిమ్ ఫామ్‌లు అప్‌లోడ్ చేయడం మొదలుకుని మృతుల పేర్లు తొలగించకపోవడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం, బయటి వారి పేర్లు నమోదు చేయించడం, డోర్ నంబర్లు, ఫోటోలు లేకుండా ఓటర్లను నమోదు చేయడం.. ఇలా సవాలక్ష అవకతవకలను గుర్తించారు. వాటిపై తహసిల్దార్ల దగ్గర నుంచీ కలెక్టరు, ఎన్నికల సంఘం వరకూ అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. వాటిపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది కూడా. గత డిసెంబరు, ఈ నెల రెండుసార్లు విజయవాడలో జరిపిన సమీక్షల్లో ప్రత్యేకంగా చంద్రగిరి గురించి అధికారులను లోతుగా ప్రశ్నించారు. అక్కడి నుంచే ఎందుకు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని నిలదీశారు. ఉదాసీనంగా వుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో జిల్లా యంత్రాంగం హడావిడిగా చర్యలకు దిగింది. ఆ క్రమంలోనే క్లెయిమ్ ఫామ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించని 24మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అప్పటి వరకూ పెద్ద సంఖ్యలో పెండింగులో వున్న వివిధ రకాల క్లెయిమ్‌లను శరవేగంగా పరిష్కరించింది. అయినా టీడీపీ నుంచీ ఆరోపణలు, ఫిర్యాదులు ఆగడం లేదు. ఈనెల 8వ తేదీన పులివర్తి నానీ తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట దొంగ ఓట్లు తొలగించాలంటూ నిరాహార దీక్షకు దిగిన సంగతి తెలిసిందే. పోలీసులు దీక్షను భగ్నం చేసేందుకు రాగా ఆయన పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆ సందర్భంగా ఆయన అస్వస్థతకు లోనయ్యారు కూడా. ఓవైపు టీడీపీ ఎదురుదాడి, మరోవైపు ఈసీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగానికి ఊపిరి సలపలేదు. ఈ క్రమంలో సోమవారం తుది జాబితా విడుదలైంది. గత ఎన్నికల నాటితో పోలిస్తే అక్కడ 17182 మంది ఓటర్లు పెరిగారు. అయితే మునుపటి జాబితాలో ఎన్ని ఓట్లు తొలగించారు, ఎన్ని ఓట్లు చేర్చారు అనే వివరాలు తెలియాల్సి వుంది. జాబితాలు పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాక గానీ, ఇచ్చిన అభ్యంతరాలు పరిష్కరించారా లేదా అనేది తెలిసే అవకాశం లేదు.

అంగన్వాడీల సమ్మె విరమణ

- 'ఛలో విజయవాడ' ను భగ్నం చేసిన పోలీసులు
- నేటినుంచి విధులకు హాజరు



తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి అంగన్వాడీల ఆందోళన

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధనకోసం 42 రోజులుగా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సమ్మె ముగిసింది. సోమవారం రాత్రి ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలవంతం కావడంతో అంగన్వాడీలు మంగళవారం నుంచీ విధులకు హాజరు కానున్నారు.కాగా కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అంటూ తిరుపతి జిల్లానుంచి ఆదివారం రాత్రి ఛలో విజయవాడ కార్యక్రమానికి బయల్దేరిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.చాలావరకూ గృహనిర్బంధంలో వుంచారు.వారి కళ్లుగప్పి వెళ్లిన వారిని కావలిలో అరెస్టు చేసి స్టేషన్లో నిర్బంధించారు. తరువాత తిరుపతికి తీసుకొచ్చి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్బంధించారు. రాత్రి 9గంటల వరకు వారిని బయటకు రానివ్వలేదు. ఆందోళనకు సిద్ధమవుతున్న క్రమంలో వారిని విడిచిపెట్టారు. ఈలోపు పగలు పలుచోట్ల అంగన్వాడీల దీక్షా శిబిరాలను కూల్చారు.అణిచివేత చర్యలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా సోమవారం అంగన్వాడీలు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు.కాగా అంగన్వాడీలపై అణిచివేత ధోరణులను ఆపివేయాలని అఖిలపక్ష నేతలు డిమాండు చేశారు. సోమవారం కలెక్టర్ వెంకటరమణా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

3362 మంది అంగన్వాడీ సిబ్బందిపై వేటు !

సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బందిపై సోమవారం జిల్లా అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. విధులకు హాజరు కావాలని ఆదేశిస్తూ జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఖాతరు చేయని సిబ్బందిపై తొలగింపు వేటు వేసింది. 1834 మంది వర్కర్లను, 1528 మంది హెల్పర్లను ఉద్యోగాల నుంచీ తొలగించిన ఉత్తర్వుల ఫైలును కలెక్టర్ ఆమోదం కోసం సోమవారం రాత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి కలెక్టరేట్‌కు పంపించారు.అయితే ఈలోపు ప్రభుత్వంతో అంగన్వాడీ యూనియన్ నేతలు జరిపిన చర్చలు ఫలవంతం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు అంగన్వాడీలు ప్రకటించారు. మంగళవారం నుంచీ విధులకు హాజరు కానున్నట్లు తెలిపారు.

జై శ్రీరామ్



సూళ్లూరుపేట రామాలయంలో లక్ష తులసిదళ పూజ

అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట సంబరాలు సోమవారం జిల్లావ్యాప్తంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సంకీర్తనా యజ్ఞాలు, శోభాయాత్రలు, అన్నదానాలతో పండుగ వాతావారణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనడం విశేషం. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారాలను జనమంతా శ్రద్ధగా వీక్షించడం కన్పించింది.





తిరుపతి వీధుల్లో మార్వాడీల శోభాయాత్ర



తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో 24గంటల అన్నమయ్య సంకీర్తనాయజ్ఞం

ర్యాంకర్ ఎస్ఐల బదిలీ

- 9మంది జిల్లానుంచి బయటకు
- ఆరుగురు ప్రకాశం నుంచి తిరుపతికి


తిరుపతి(నేరవిభాగం), జనవరి 22: ఎన్నికల నియమావళి మేరకు జిల్లాలో పలువురు ర్యాంకర్ ఎస్ఐల బదిలీలు జరిగాయి. గుంటూరు సౌత్‌కోస్టల్ జోన్ పరిధిలో పదోన్నతులద్వారా ఎస్ఐ ర్యాంకులు పొంది, సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీచేస్తూ సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న టీసీ కృష్ణయ్య, ఎం. జ్ఞానశేఖర్, కె. వెంకటేశ్వర్లు, ఎం.వేణుగోపాల్, వి. ప్రేమయ్య, ఇ. వెంకయ్య, పి. సుబ్రహ్మణ్యంలను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న కె. శ్రీనివాస రావు, ఎస్‌డీ మీరాసాహెబ్, ఎస్‌కే అమీర్, యు. సుబ్బారావు, జి. సుబ్రహ్మణ్యం, కె. వేణుగోపాల్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు.

ఇద్దరు సీఐలకు స్థాన చలనం

జిల్లాలో ఇద్దరు సీఐలకు స్థానచలనం కలిగింది. పాకాల సీఐ జి.ఓబులేసును పుత్తూరుకు,ఏర్పేడు సీఐ వి.శ్రీహరిని బీఎన్ కండ్రిగకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజి డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యో పసిబిడ్డ...!

- స్కూలు నుంచి బస్సులో ఇంటికి వచ్చిన అన్న
- అదే బస్సు కింద పడి చనిపోయిన తమ్ముడు
- ఎంఎంసీ కండ్రిగలో పెనువిషాదం



దేవాన్ష్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జనవరి 22: బడికి వెళ్లిన అన్న బస్సులో తిరిగి ఇంటి వద్దకు వచ్చాడు. అమ్మ చేయి పట్టుకుని అన్న కోసం మూడేళ్ల బాలుడు సంతోషంగా బస్సు వద్దకు వెళ్లాడు.ఆ ఉత్సాహంలో అమ్మ చేయి వదిలిపెట్టిన ఆ పసిబిడ్డ బస్సు కింద పడి చనిపోయాడు. శ్రీకాళహస్తి మండలం మన్నవరం కండ్రిగలో సోమవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.రూరల్ సీఐ అజయ్ కుమార్ కథనం మేరకు.. మన్నవరం కండ్రిగలోని దళితవాడకు చెందిన చిన్న కాటయ్య ఓ కర్మాగారంలో దినసరి కూలీగా పని చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు.ఐదేళ్ల వయసున్న పెద్ద కొడుకును శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ కార్పొరేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. రోజూ పాఠశాల బస్సులోనే వెళ్లి వస్తుంటాడు.సోమవారం సాయంత్రం స్కూల్ బస్సు ఇంటి వద్దకు వచ్చింది. తల్లి ఆదిలక్ష్మి చిన్న కొడుకు దేవాన్ష్‌ను వెంటబెట్టుకుని బస్సు వద్దకు వెళ్ళింది. పెద్ద కొడుకును కిందకు దించుకునే సమయంలో దేవాన్ష్ అమ్మ చేయిని జారవిడిచి పక్కకు వెళ్లాడు.స్కూల్ బస్సు ముందుకు కదలడంతో బస్సు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు.గుండెలు బాదుకుంటూ హుటాహుటిన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి శివారులోని వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.పోలీసులు స్కూలు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు.

రెడ్డిచెరువులో యువకుడి గల్లంతు

ఎర్రావారిపాలెం, జనవరి 22 : చేపలు పట్టేందుకు తమ గ్రామస్తులతో పాటు వెళ్ళిన ఓ యువకుడు చెరువులో గల్లంతయ్యాడు. రెండు రోజులుగా చెరువులో గాలిస్తున్నా ఆచూకీ దొరక్కపోవడంతో నిండు గర్భిణి అయిన అతడి భార్యను సముదాయించడం ఎవరివల్లా కావడంలేదు.ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన గల్లా సిద్ధయ్య కుమారుడు గణేష్ (24) భార్య జయంతి ప్రస్తుతం నిండు గర్భిణి.ఊరికి ఆనుకునే ఉన్న రెడ్డిచెరువులోకి చేపలు పట్టేందుకు ఆదివారం గ్రామానికి చెందిన దుగ్గిపాక వెంకట్రమణ, సంగీతం సుబ్రమణ్యం వలలు తీసుకొని పోతుండగా గణేష్ తానూ వస్తానని అడిగాడు. అప్పటికే గణేష్ మద్యం మత్తులో ఉండడంతో వద్దని వారించి వారు చెరువులోకి వెళ్ళారు. చేపల వేట ముగించుకుని గట్టుమీదకు వచ్చిన ఆ ఇద్దరికీ అక్కడ గణేష్ షర్ట్, లుంగీ కనపడ్డాయి. గణేష్‌ను పేరు పెట్టి గట్టిగా పిలిచినా పలక్క పోవడం, నీటిలో వెతికినా జాడలేకపోవడంతో ఇంటికి వెళ్ళాడేమోనని ఊర్లోకి వచ్చి విషయం చెప్పారు. ఇంటివద్ద గణేష్ లేకపోవడంతో చెరువులో మునిగిపోయాడేమోనని అనుమానించారు.సోమవారం కూడా రెడ్డిచెరువులో సర్పంచ్ లోకేష్ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో చాలా లోతు నీళ్ళుండడంతో గణేష్ ఆచూకీ కానరాలేదు.దీంతో పోలీసులకు సర్పంచ్ లోకేష్ సమాచారం అందించారు. మంగళవారం గణేష్ జాడ కనుగొంటామని పోలీసులు తెలిపారు.



గణేష్

నేడు, రేపు జాతీయస్థాయి విద్యాసమ్మేళనం

రేపు సీఎం జగన్, మంత్రి బొత్స హాజరు

తిరుపతి(విద్య),జనవరి 22 : తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో మంగళ, బుధవారాల్లో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ పేరిట జాతీయస్థాయి విద్యాసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీఈవో శేఖర్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 5.15గంటలకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.అడాప్టింగ్ ఎక్సలెన్స్, విద్యలో డిజిటల్ రెవెల్యూషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేఅంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. బుధవారం సాయంత్రం 5.15గంటలకు జరిగే సెషన్‌ను సీఎం జగన్ ప్రారంభిస్తారని, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు.

భాకరాపేట ఘాట్‌లో బస్సు బోల్తా

● 13 మందికి గాయాలు



బోల్తా పడిన ప్రైవేటు బస్సు (ఇన్‌సెట్‌లో) గాయపడిన క్లీనర్ హరీష్

చంద్రగిరి, జనవరి 22: మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనలో 13 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బళ్ళారి నుంచి చెన్నైకి ఓ ప్రైవేటు బస్సు వెళుతూ సోమవారం ఉదయం 5 గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డు మలుపులోకి రాగానే బోల్తా పడింది. బస్సులో 30 మంది ప్రయాణికులుండగా వారిలో 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బస్సు బ్రేక్ ఫెయిలవడంతో అదుపు తప్పి బోల్తా పడిందని డ్రైవర్ నూర్ తెలిపాడు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



చంద్రగిరి, జనవరి 22: చంద్రగిరి మండలం పనపాకం వద్ద సోమవారం ఉదయం బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. మైసూరు నుంచి అల్లం లోడుతో తిరుపతికి వస్తుండగా పనపాకం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది.

ఐరన్ షీట్ల వితరణ

భాకరాపేట, జనవరి 22: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల పైకప్పుకు ఐరన్ షీట్లను వలసారెడ్డిగారిపల్లెకు చెందిన జడ్పీ మాజీ ఛైర్మన్ సిద్దరామిరెడ్డి కుమారుడు శివప్రసాద్ రెడ్డి విరాళంగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్ తెలిపారు.నాలుగు గదులు, వరండాలకు రూ.5 లక్షల వ్యయంతో ఐరన్ షీట్లు వేయించారన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



భాకరాపేట, జనవరి 22: చిన్నగొట్టిగల్లులోని సీతారాములు, మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి ఉభయదారులుగా బాలసుబ్రహ్మణ్యం,శ్రీనివాసులు దంపతులు వ్యవహరించారు. అలాగే మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణానికి ఉభయదారులుగా హరినాథ్ రెడ్డి, హరీశ్ బాబు దంపతులు వ్యవహరించారు. చిన్నగొట్టిగల్లు గ్రామస్తులచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

లారీ కిందకు దూసుకెళ్ళిన కారు

లోపల ఇరుక్కుపోయిన హెడ్‌కానిస్టేబుల్





కారులో ఇరుక్కుపోయిన మునికృష్ణను బయటకు తీస్తున్న దృశ్యం - తీవ్రంగా గాయపడిన మునికృష్ణ

చంద్రగిరి, జనవరి 22: చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సోమవారం ఉదయం ముందు వెళుతున్న లారీ కిందకు ఓకారు దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా అందులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ మునికృష్ణ తన కుటుంబసభ్యులతో కారులో నెల్లూరు నుంచి బెంగుళూరుకు వెళుతున్నారు. చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి లారీ కిందకు దూసుకెళ్ళింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా అందులో ఉన్న మునికృష్ణ, ఆయన కుమారుడు దీపక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన మునికృష్ణను పోలీసులు, స్థానికులు బయటకు తీసి, చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ హిమబిందు అక్కడికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడవాడలా శ్రీరామ నామస్మరణే



చంద్రగిరిలో బ్లూమింగ్ బడ్స్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

కోదండ రామాలయానికి పట్టువస్త్రాలు సమర్పణ





పాకాలలో శ్రీరాముడి చిత్రపటంతో శోభాయాత్ర

చంద్రగిరి, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వాడవాడలా శ్రీరామనామ స్మరణలతో మార్మోగాయి. చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్ విద్యార్థులు కాషాయ జెండాలను చేతబట్టుకుని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ చంద్రగిరి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా చేగు యూత్, వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్‌గుప్తా ఆధ్వర్యంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి చంద్రగిరిలోని కోదండ రామస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.పాత శానంబట్లలో బీజేపీ నాయకుడు వెంకటముని ఆధ్వర్యంలో శ్రీరామచంద్రమూర్తి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. రెడ్డివీధి యూత్ ఆధ్వర్యంలో శ్రీరామ ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా తొండవాడలోని రామాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

పాకాల : స్థానిక రైల్వే కాలనీలోని కోదండ రామాలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భజనలు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తలపై చల్లుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి సీతారాముల చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.ఆనందగిరి ఆలయ కమిటీ ఛైర్మన్ పట్టాభిరెడ్డి, ప్రధాన అర్చకుడు మురళీస్వామి, గంగాధరం, సుబ్బారావు, శ్రీదర్‌రెడ్డి, వెంకటేష్, రవి పాల్గొన్నారు.



ఎర్రావారిపాలెం: మండల పరిధిలోని గ్రామాలన్నీ సోమవారం రామకీర్తనలతో మారుమోగాయి. అయోధ్యలో తిరిగి కోదండ రామయ్య కొలువైన శుభదినం కావడంతో ఉదయం ప్రతి ఇంటా కల్లాపి చల్లి ముగ్గులు వేసి భక్తితో తరించారు. సంధ్యవేళ ప్రతి ఇంటా దీపారాధనతో మహిళలు శ్రీరాముడిని కొలిచారు.

అంతా రామమయం



ప్రత్యేకఅలంకారంలో భవానీ జలకంఠేశ్వరాలయం

రామచంద్రాపురం, జనవరి 22: అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఊరువాడా రామమయం అయింది. రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వరాలయం, శ్రీశక్తి పీఠం, రామాపురం బ్రహ్మర్షిపీఠం, తారకల్వ రాజరాజేశ్వరీపీఠాల్లో విశేషపూజలు చేశారు. అన్నదానం చేశారు. మండలంలోని అన్ని రామాలయాల్లో ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భవనీ జలకంఠేశ్వరాలయం వద్ద జైరామ్ రూపంలో దీపాలు వెలిగించారు.

చెవిరెడ్డి కన్నుసన్నల్లోనే దొంగ ఓట్ల నమోదు

- పులివర్తి నాని ఆరోపణ -



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పులివర్తి నాని

రామచంద్రాపురం, జనవరి 22: చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కన్నుసన్నల్లోనే దొంగ ఓట్లు నమోదయ్యాయని టీడీపీ చంద్రగిరి ఇన్‌చార్జి పులివర్తి నాని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆర్‌సీపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దొంగ ఓట్ల నమోదుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల నమోదుకు చెవిరెడ్డే కీలకమయ్యారన్నారు.దొంగ ఓట్ల నమోదుపై ఏడు నెలలుగా ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సాక్ష్యాధారాలతో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎర్రచందనం, గ్రావెల్, ఇసుక, గంజాయి, భూఆక్రమణలు చెవిరెడ్డి ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయని విమర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, జిల్లా నాయకులు జనార్ధన్‌చౌదరి, హరిప్రసాద్, ఢిల్లీనాథరెడ్డి, నరసింహారెడ్డి, న్యాయవాది మునెయ్య, ధనంజయరెడ్డి, మండల నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, సురేంద్రనాయుడు, మునిరాజారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కోటీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

39వేల దొంగ ఓట్లు చేర్చారు

● టీడీపీ నాయకురాలు సుధారెడ్డి ఆరోపణ

● దొంగ ఎపిక్ కార్డులను సృష్టించిన వారందరిపై చర్యలేవీ?: నరసింహయాదవ్



ఆర్డీవో నిశాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న నరసింహయాదవ్, సుధారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: చంద్రగిరి నియోజకవర్గంలో 39వేల దొంగ ఓట్లు చేర్చారని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆరోపించారు. కలెక్టరేట్‌లో ఓటర్ల తుదిజాబితాపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షించారు. ఈ సమావేశానికి టీడీపీ, బీజేపీతోపాటు పలుపార్టీల నాయకులు విచ్చేశారు. సమావేశం అనంతరం టీడీపీ నాయకురాలు సుధారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది ఓటర్ల జాబితాలో 2.90లక్షలు చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లు ఉండగా ఈ ఏడాది ప్రకటించిన తుది జాబితాలో 3.09లక్షలకు చేరిందన్నారు. తమ ఫిర్యాదులు, అభ్యంతరాలతో 18వేలకు పైగా ఓట్లను తొలగించినట్లు సాక్షాత్తూ ఆర్డీవోనే ప్రకటించారని చెప్పారు. ఈలెక్కన సుమారు 39వేల దొంగ ఓట్లను అధికార పార్టీ చేర్పించిందని అర్థమవుతోందన్నారు. విడ్డూరం ఏమిటంటే.. 40 ఏళ్ల పైబడి 80 ఏళ్లలోపున్న 6వేల మంది కొత్త ఓటర్లను చేర్చారని.. ఇన్ని సంవత్సరాల్లో వారికి ఎక్కడా ఓటు లేదా? ఇవన్నీ దొంగ ఓట్లు కావా అని ప్రశ్నించారు. చంద్రగిరి ఎన్నికల అధికారుల లాగిన్‌పై సాంకేతిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ.. 35వేల దొంగ ఎపిక్ కార్డుల విషయంలో అధికారులను సస్పెండ్ చేశారని, అయితే వీటిని సృష్టించిన నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మిగిలినవారిపైనా చర్యలు తీసుకుని, అసలు సూత్రధారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడికొచ్చిన ఆర్డీవోతోనూ నాయకులు మాట్లాడారు. జాబితాలో ఫొటోలు గతంలోలా స్పష్టంగా కనిపించేలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ ఆచారి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

తిరుపతి అర్బన్, జనవరి 22: మూడు ప్రాంతాల్లో నిర్వహించిన కూంబింగ్‌లో 20 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. రెండు వాహనాల సహా 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ మీడియాకు తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలమేరకు అన్నమయ్య జిల్లాలోని రాజంపేటకు చెందిన ఆర్‌ఐ చిరంజీవి, ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందాలు కూంబింగ్ చేస్తుండగా.. సుండుపల్లి మండలం సానిపాయ రేంజ్‌లో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపారు. వీరిని చూసి వాహనంలోని వారు పరారయ్యారు. వెంబడించి, బెంగళూరుకు చెందిన సయ్యద్ నౌషద్(28)ను పట్టుకుని ఐదు ఎర్రచందనం దుంగలను, కారును సీజ్ చేశారు. అలాగే ఆర్‌ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడి బృందాలు రాజంపేట రేంజ్ ఎస్‌ఆర్‌పాళెం సెక్షన్ పరిధిలోని పుట్టంగి మడుగు వద్ద కూంబింగ్ నిర్వహిస్తుండగా.. కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయే ప్రయత్నం చేశారు. వీరిలో తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ఏలుమలై కుప్పుస్వామి(28)ని పట్టుకున్నారు. సంఘటనా స్థలం నుంచి ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇక రైల్వేకోడూరుకు చెందిన ఆర్‌ఐ కృపానంద, ఆర్‌ఎస్‌ఐలు రాఘవేంద్ర, విశ్వనాథ్‌లు నెల్లూరు జిల్లా రాజుపాళెం బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. వెంకటరామరాజుపేట వద్ద కొందరు టెంపో ట్రావెలర్ దిగుతుండగా చుట్టుముట్టి తనిఖీ చేశారు. వారి వద్ద ఎనిమిది ఇనుప గొడ్డళ్లు, మడతపెట్టిన రంపాలను గుర్తించడంతో స్మగ్లర్లుగా నిర్ధారించుకుని 18 మందిని అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. వీరిలో.. తమిళనాడుకుచెందిన శేఖర్ వెలకాసి(41), దశ్యన వెలకాసి(33), ప్రకాష్ చిన్నపయ్య(43), అశోక్(33), పొన్నుస్వామి చిన్నప్పయన్(43), సంపత్ దబ్బినామూర్తి(19), సుందరేశన్ సూర్యన్(24), రాజువేలు సూర్యన్(29), రాజేంద్రన్‌చిన్నస్వామి(39), చిన్నస్వామి రాజి(64), చంద్రన్ సడమన్(49), విజయకుమార్(43), మురుగన్ పొన్నుస్వామి (44), విజయకుమార్ ముత్తు (35), రామన్ చిన్నపయ్యన్(39), సౌందర మణి(21) కుప్పుస్వామి అప్పస్వామి(39), నెల్లూరుకు చెందిన నక్కన మహేష్‌రెడ్డి ఉన్నారు. ఈ కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాయలంలో నమోదుచేసి ఎస్‌ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పరారైన వారి కోసం స్పెషల్ టీమ్‌లతో కూంబింగ్ కొనసాగిస్తున్న డీఎస్పీ మురళీధర్ తెలిపారు.

ఘనంగా రామాయణ పారాయణం



తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తిరుమల ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ వాల్మీకి రామాయణ పారాయణం ఘనంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ సమేత రాముడు, హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండలు కలిపి 20 వేలకుపైగా శ్లోకాలను పారాయణం చేశారు. అలాగే యాగశాలలో వేద విద్యార్థులతో ఏడు వేదశాఖల సంపూర్ణ మూలపారాయణం చేపట్టారు. వీటితోపాటు ఆనందనిలయంలో ప్రబంధ, ఆగమ విద్యార్థులతో సీతారామ మంత్రానుష్టానం, కార్యాలయంలోని హాల్‌లో స్మార్త విద్యార్థులతో లక్షణ, హనుమ మంత్రానుష్టానం చేశారు. ఈకార్యక్రమంలో వేదపాఠశాల ప్రిన్సిపాల్ అవధాని, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎంఎస్ డేటా సైన్స్ కోర్సు ప్రారంభం



ప్రారంభోత్సవంలో వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22: ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్ డేటా సైన్స్ కోర్సును సోమవారం వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అమెరికాకు చెందిన ఎక్స్‌ప్లాయెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకుందన్నారు. ఇందులో భాగంగా యూనివర్సిటీలో ఎంఎస్ డేటా సైన్స్ కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కోర్సులో ఈ ఏడాది 30 మందికి ప్రవేశాలు కల్పించామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ఎక్స్‌ప్లాయెన్స్ ప్రతినిధులు రవికిరణ్, శ్రీనివాసస్, రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ విజయభాస్కరరావు, ప్రిన్సిపాల్ నరసయ్య, కోర్సు కో-ఆర్డినేటర్ అంజన్‌బాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ మురళి, రూసా సీఈవో వంశీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించేదెప్పుడు?

● అధికారుల ఎదుట బాధితుల ఆవేదన ● కలెక్టరేట్‌లో 'స్పందన'కు 96 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: కలెక్టరేట్‌కు వారం.. వారం తిరుగుతూనే ఉన్నా.. తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అధికారుల ఎదుట బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు అర్జీదారులు పెద్దఎత్తున విచ్చేసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మొత్తం 96 అర్జీలు అందాయి. వీటిల్లో 75 అర్జీలు వరకు భూసమస్యలపైనే ఉన్నాయి. ఈ అర్జీలను నిర్లక్ష్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఇతర అధికారులు స్వీకరించారు.

పరిహారమివ్వలేదు



మా గ్రామానికి చెందిన భూములను జగనన్న కాలనీకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా పరిహారం ఇవ్వలేదు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇకనైనా న్యాయం చేయండి.

- చెంచయ్య, రైతు, చిందేపల్లె, ఏర్పేడు మండలం

ఇంటి స్థలం ఇప్పించండి



మేము కూలీనాలి చేసుకుంటాం. ఉండటానికి ఇల్లు లేదు. ప్రభుత్వ ఇంటి స్థలం కోసం కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించండి.

- రత్నమ్మ, తారకరామనగర్‌కాలనీ, రేణిగుంట

ఇంటి స్థలాల కోసం కలెక్టరేట్‌ను ముట్టడించిన తారకరామనగర్‌వాసులు



డీఆర్వోను చుట్టుముట్టిన తారకరామానగర్‌వాసులు

పట్టాలిచ్చి.. ఇంటి స్థలాలు చూపలేదంటూ కొందరు, తమకు ఇంటి స్థలం కావాలంటూ మరికొందరు సుమారు 400మంది వరకు రేణిగుంట మండలం తారకరామానగర్‌వాసులు, పరిసర ప్రాంతాలవారు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఏర్పేడు పాగాలి వద్ద జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చినా, అది కోర్టు పరిధిలో ఉందని చెబుతున్నారన్నారు. అటువంటప్పుడు తమకు పట్టాలు ఎందుకు ఇచ్చారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కరకంబాడి వంటి ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాదాపు గంటన్నరకుపైగా బైఠాయించడంతో డీఆర్వో పెంచలకిషోర్ వచ్చి వారికి నచ్చచెప్పారు. అలాగే పోలీసులొచ్చి సర్దుబాటు చేసి పంపారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

పోలీసు 'స్పందన'కు 70 అర్జీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 70 అర్జీలు అందాయి. ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారితో కలిసి బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ పరమేశ్వరరెడ్డి స్వీకరించారు. అనంతరం సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, ఆస్తి తగాదాలు తదితర సమస్యలపై అర్జీలు అందాయి.

చంద్రగిరి తుది ఓటర్ల జాబితా విడుదల: ఆర్డీవో

తిరుపతి (రవాణా), జనవరి 22: చంద్రగిరి నియోజకర్వగ ముసాయిదా ఓటర్ల తుది జాబితా విడుదలైనట్లు ఈఆర్వో, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో 395 పోలింగ్ కేంద్రాలకు గాను 1,50,249 మంది పురుషులు, 1,58,607 మంది మహిళలు, ఇతరులు 60 మంది కలిపి మొత్తం 3,08,916 మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. ఇందులో 18-19 ఏళ్లలోపువారు 6,275మంది ఉన్నారన్నారు. తప్పుడు ఫొటోలు, చిరునామాలతో దరఖాస్తు చేసుకున్న పదిమంది దరఖాస్తుదారులపై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఫారం-6 కింద 52వేలమంది దరఖాస్తు చేసుకోగా.. 25వేల అప్లికేషన్లు, ఫారం-7 కింద 32,500 మంది దరఖాస్తు చేసుకోగా.. 18వేల అప్లికేషన్లు, ఫారం-8 కింద 37వేలమంది దరఖాస్తులు చేసుకోగా.. 33వేలను యాక్సెప్ట్ చేసినట్లు ఆర్డీవో వివరించారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారిలో చిరునామాలో లేకుండా 2,466 మంది ఉన్నారని చెప్పారు.

యోగ సాధనతో ఆరోగ్యం



పతంజలి వేదికలో ప్రసంగిస్తున్న జ్యోతి

తిరుపతి (కల్చరల్), జనవరి 22: యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ఆచార్య దక్షిణామూర్తి శర్మ అన్నారు. సోమవారం సాయంత్రం తిరుపతి పుస్తక ప్రదర్శనలోని పతంజలి వేదిక నుంచి ఆయన మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శన కోసం భారతీయ విద్యాభవన్ సంచాలకులు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. సంస్కృత విశ్వవిద్యాలయం సాంఖ్య శాస్త్ర శాఖాధ్యక్షులు ఆచార్య డి.జ్యోతి మాట్లాడుతూ..యోగసాధనతో స్థిత ప్రజ్ఞత అలవడుతుందన్నారు. సభకు విద్యాభవన్ సంచాలకుడు డాక్టర్ సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ నల్లన్న, డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ, తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సాహితీప్రియులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు నుంచి 6.30 గంటల వరకు భారతీయ విద్యాభవన్, శ్రీవేంకటేశ్వర విద్యాలయ విద్యార్థుల సంగీత విభావరి ఆహూతులను అలరించింది. మధ్యాహ్నం మూడు గంటలకు 8 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు.. పుస్తక పఠనంపై ఆధునిక పరికరాల వినియోగ ప్రభావం అనే అంశంపై పోస్టర్ మేకింగ్ పోటీలు జరిగాయి.

నేటి కార్యక్రమాలిలా.. పుస్తక ప్రదర్శనలో మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల మధ్య 8 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగుతాయి. అనంతరం సంగీత విభావరి ఉంటుంది. తర్వాత వరాహమిహిర వేదికపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎ. శ్రీపాద భట్, విశ్రాంత బ్యాంక్ అధికారి ఎస్.బద్రీనారాయణ అతిథులుగా పాల్గొంటారు.

జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

తిరుపతి (రవాణా), జనవరి 22: తిరుపతి నుంచి పుత్తూరు తిరువళ్లూరు మీదుగా చెన్నై వెళ్లే జాతీయ రహదారి (205) విస్తరణకు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం ఒప్రకటనలో తెలిపారు. తిరుపతి నుంచి పుత్తూరు, తిరువళ్లూరు మీదుగా చెన్నై వెళ్లే జాతీయ రహదారి, అలాగే తిరువళ్లూరు నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు వరకు ఒక ప్యాకేజీ కింద 43.950కి.మీ. పొడవున నిడివితో రూ.756.82కోట్లు, తమిళనాడు సరిహద్దు నుంచి పుత్తూరు వరకు 20.030కి.మీ నిడివి గల రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు, మల్లవరం నుంచి రేణిగుంట వరకు 17.40కి.మీ. నిడివిగల నాలుగులేన్ల రహదారిని ఆరులేన్లుగా, మల్లవరం నుంచి ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు వరకు 37.43కి.మీ నిడివి కల్గిన మార్గానికి రూ.775.72కోట్లతో జాతీయ రహదారుల సంస్థ టెండర్లకు ఆహ్వానం పలికినట్లు ఎంపీ వివరించారు. తిరుమలకు నిత్యం తమిళనాడులోని తిరువళ్లూరు-పుత్తూరు మార్గంలో సుమారు 20వేలమంది భక్తులు ప్రయాణిస్తుంటారు. అలాగే తిరుపతి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో వ్యాపార నిమిత్తం చెన్నై నగరానికి పెద్దసంఖ్యలో ప్రయాణిస్తుంటారని కేంద్రమంత్రికి ఎంపీ వివరించారు.

సెవెన్‌హిల్స్ అవగాహన ఒప్పందం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు

రామచంద్రాపురం, జనవరి 22: అమెరికాకు చెందిన బోగా ఆర్ లేబొరేటరీస్‌తో వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు తెలిపారు.ప్రొఫెసర్ వెంకట్రావు, ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌బాబు, బోగా మేనేజింగ్ డైరెక్టర్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, బోధన సిబ్బంది పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక అంశాలపై ఒప్పందం చేసుకున్నామన్నారు. కళాశాల కరస్పాండెంట్ సుమలత, అడకమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శవరణకుమార్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ కార్యాలయాలు

తిరుచానూరు, జనవరి 22: సీఎం జగన్ పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామంలో సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ యశోద, సర్పంచ్ జ్యోతి, హేమావతి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఎదుటి మనిషి కోసం సమయం కేటాయించడమూ సాయమే



కార్యక్రమంలో పాల్గొన్న గోపాల్

తిరుపతి రూరల్, జనవరి 22: ఎదుటి మనిషి కోసం సమయాన్ని కేటాయించి వారి మంచి చెడులను వినడం కూడా ఒక విధమైన సహాయమేనని దుర్గ సముద్రంలోని అక్షయ క్షేత్రం నిర్వాహకులు గోపాల్ పేర్కొన్నారు. అక్షయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం అక్షయ క్షేత్రంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు రెడ్డిశేఖర్, సరళ, వాణి, గణేష్, లీలావతి పాల్గొన్నారు.

భూలక్ష్మి ప్రకృతి వనరుల కేంద్రం ప్రారంభం



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో తిరుపతి భూలక్ష్మి ప్రకృతి వనరుల కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విస్తరించడానికి రెండు ఆటంకాలు ఉన్నాయని మొదటిది రైతులకు ప్రకృతి వనరులు అందుబాటులో లేకపోవడం, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం అన్నారు. వాటిని అధిగమించడానికి తిరుపతి భూలక్ష్మి ప్రకృతి వనరుల కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, అడిషల్ డీపీఎం పట్టాభి, ప్రకృతి వ్యవసాయదారుల అయ్యప్పనాయుడు, మునిరత్నం, రామచంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 25న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 25వ తేదీన రామకృష్ణతీర్థ ముక్కోటి జరగనుంది. ఈ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో వెలసి ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈతీర్థ ముక్కోటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అలాగే పౌర్ణమి సందర్భంగా ఆరోజున రాత్రి గరుడసేవను కూడా టీటీడీ నిర్వహిస్తుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.04 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 77,334 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,694 మంది తలనీలాలు సమర్పించారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



తిరుపతి(విద్య), జనవరి 22: జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లోని 89మంది విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ లెవల్-2(నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్)పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు. వీరిలో ఐదుగురు విద్యార్థులు నగదుబహుమతి, మిగిలినవారు గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నట్లు వివరించారు. ఏడో తరగతి విద్యార్థులు పి.అశితోష్‌రెడ్డి రూ.4వేలు, వి.మోహిత్‌వంశీ రూ.3వేలు, డి.మోహిత్, ఎన్.లలిత్‌చంద్ర రూ.వెయ్యి, ఆరో తరగతి విద్యార్థి ఆర్.తేజేశ్వరరెడ్డి రూ.వెయ్యి చొప్పున బహుమతి పొందారన్నారు. విద్యార్థులను ఏజీఎం జి.సురేష్, జోనల్ కోఆర్డినేటర్ బాలాజి, డీన్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, టీచర్లు అభినందించారు.

ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న సదాభార్గవి

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను జేఈవో సదా భార్గవి ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో ఆమె అధికారులతో సమీక్షించారు. సదస్సుకు దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులను ఆహ్వానించేందుకు ఆహ్వానపత్రికలు, ధార్మిక కార్యక్రమాలపై బుక్‌లెట్ రూపొందించాలని డీపీపీ అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం, వసతి, రవాణా సదుపాలను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ నిర్వహించే ధర్మప్రచార కార్యక్రమాలపై వీడియో రూపొందించాలని ఎస్వీబీసీ సీఈవోను కోరారు. అనంతరం పలు సూచనలిచ్చారు. వేద విశ్వవిద్యాలయం వీసీ రాణిసదాశివమూర్తి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, డీపీపీ కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణంలో విశేష కృషి చేసిన మోదీ
ఎంపీ సుజనా చౌదరి



తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామాలయ నిర్మాణం విషయంతో ప్రధాని నరేంద్రమోదీ విశేష కృషి చేశారని ఎంపీ సుజనా చౌదరి అన్నారు. సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దాదాపు 500 ఏళ్ల తర్వాత అయోధ్యలో రామమందిర నిర్మాణం జరగడమనేది సామాన్య విషయం కాదన్నారు. స్వామి ఆశీస్సులతో శ్రీరామ ఆలయంలో ప్రాణప్రతిష్ఠ జరగడం చాలా సంతోషమన్నారు. ఇక, ఏపీతోపాటు దేశంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు చెప్పారు. అలాగే.. స్వామివారిని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మంత్రి అంబటి రాంబాబు, స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం దర్శించుకున్నారు.

హెచ్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శిగా విజయ్‌శేఖరరెడ్డి



తిరుపతి(విద్య), జనవరి 22: హిందూ ఉపాధ్యాయ సమితి (హెచ్‌యూఎస్) రాష్ట్ర కార్యదర్శిగా ఎంఆర్‌పల్లె జడ్పీహెచ్ఎస్ తెలుగు టీచర్ డి.విజయ్‌శేఖరరెడ్డి ఎన్నుకున్నట్లు జాతీయఅధ్యక్షుడు మహేష్ డేగల తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని విజయ్‌శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

28న సైనిక్ పాఠశాలల ప్రవేశపరీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: అఖిల భారత సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్షను ఈనెల 28వ తేదీ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఈనెల 21వ తేదీన జరగాల్సి ఉండగా, మార్పు చేశారన్నారు. అభ్యర్థులు గమనించాలని సూచించారు.

టీడీపీకి తిరుపతి ఓ కంచుకోట



మీడియాతో మాట్లాడుతున్న ఆనంద్‌నాయుడు

తిరుపతి(తిలక్ రోడ్), జనవరి 22: తిరుపతి నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని ఆ పార్టీ సీనియర్ నాయకులు బుజ్జినాయుడు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతినాయుడు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఆనంద్ నాయుడితో కలిసి మీడియాతో మాట్లాడారు. నియోజవర్గంలో కాపులకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది టీడీపీ అన్నారు. ఎక్కువ శాతం తిరుపతి ఎమ్మెల్యేలు కాపులేనని గుర్తుచేశారు. అయితే జగన్‌కి చెందిన పత్రికలో కాపు, కమ్మ, యాదవులకు చిచ్చుపెట్టేలా రాయడాన్ని ఖండించారు. అధిష్ఠానం ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా టీడీపీ, జనసేన కలిసి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లోకేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం



నగరంలో అన్నమయ్య విగ్రహాల ఊరేగింపు

తిరుపతి (కల్చరల్), జనవరి 22: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం తిరుపతి, పరిసరాల్లో రామనామం ప్రతిధ్వనించింది. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు పరిపాలనా భవనం నుంచి అన్నమయ్య ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించింది. భవానీ నగర్, కోదండరామాలయ మాడవీధులగుండా అన్నమాచార్య కళామండపం చేరుకుంది. 11 గంటల నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు గానం చేశారు. ఈ గోష్ఠిగానం మంగళవారం ఉదయం 11 గంటల వరకు నిరంతరాయంగా జరుగుతుంది.

అన్నదానం



అన్నదానం చేస్తున్న గాండ్ల సంఘం ప్రతినిధులు

తిరుపతి(కొర్లగుంట): గాండ్ల మిట్టవీధి కూడలిలో ఉన్న భజనమందిరం వద్ద జరిగిన గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. తిరుపతి గాండ్ల సంఘం ప్రతినిధులు గిరి, శేఖర్, శేణు, దాము, శేషు, భార్గవ్, చంద్రకాంత్‌బాబు, రజనీకాంత్‌బాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ● కపిలతీర్థం కూడలి వద్ద అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఛైర్మన్ నరసింహారావు, ట్రెజరర్ కాకర్ల సురేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ● రైల్వే కాలనీలో శ్రీరామ భక్తుడు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలోనూ పేదలకు అన్నదానం చేశారు. మురళి, సోము, చాణిక్య, కొండమ్మ, స్థానికులు పాల్గొన్నారు.



చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్వీడబ్ల్యూ పూర్వ ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ సహకార సంఘం సభ్యులు భాగవతుల జయలక్ష్మి, సీఆర్‌కే శేషగిరిరావు, కామేశ్వరరావు, అపర్ణ, దాక్షాయని, ఎ.సుబ్బారావు, చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.



తిరుపతి (రవాణా): తీర్థకట్టవీధిలో పసుపర్తి సూపర్‌మార్కెట్ నుంచి రాఘవేంద్ర స్వీట్స్ వరకు ఉన్న దుకాణాల నిర్వాహకులు పేదలకు అన్నదానం చేశారు. వ్యాపారులు నవరామ్ మాలి, ప్రకాష్, బాబునాయుడు,శ్యామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర



జనసేన ఆధ్వర్యంలో సాయంత్రం గాంధీరోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి కోదండరామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, రాజేష్ యాదవ్, హేమకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

అన్నదానం, అక్షతల పంపిణీ



తిరుపతి(కొర్లగుంట), జనవరి 22: గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు ఛైర్మన్ పి.సి.రాయలు ఆధ్వర్యంలో శ్రీరాముల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అక్షతలు, అన్నదానం చేశారు. ట్రస్టు డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండిమధుసూదన్‌రెడ్డి, ఉదయగిరికృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్, జనవరి 22: పాతకాల్వ గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. సంతాన ధర్మ పరిరక్షణ ట్రస్ట్ నిర్వాహకుడు మాకిరెడ్డి అరుణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యలో భూమన

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అయోధ్యలో సోమవారం బాలరాముడిని దర్శించుకున్న ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ఒక విగ్రహ రూపంలో రాముడే అయోధ్యకు మళ్లీ దిగివచ్చినట్టుగా అనిపిస్తోందన్నారు.

నేతి దీపారాధన



తిరుపతి(కొర్లగుంట), జనవరి 22: పెద్దకాపు వీధిలోని భజన మందిరంలో సోమవారం సాయంత్రం నేతి దీపారాధన చేశారు. బీజేపీ నాయకుడు గుండాలగోపీనాథ్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



తిరుపతి (రవాణా): కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల విద్యార్థులు జై శ్రీరామ్ అనే అక్షరాల ఆకృతిలో కూర్చొన్నారు. పాఠశాల అధినేత కేఎస్ వాసు, డైరెక్టర్లు కేఆర్ అనురాధ గోపాల్, ప్రమీల కృష్ణన్ పాల్గొన్నారు.

'పెద్దకాపు'పై పగ ఇంకెన్నాళ్లు?

రెండేళ్లుగా నరకం చూస్తున్న స్థానికులు, వ్యాపారులు - యాత్రికులకూ అవస్థలే

కమిషనర్‌కు మూడోసారి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ, కంకణాల రజనీకాంత్ తదితరులు

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దకాపు లేఅవుట్‌పై పాలకులు పెట్టుకున్న పగ ఇంకా తీరినట్టులేదు. గత ఎన్నికల్లో వైసీపీకి మెజారిటీ రాలేదన్న కోపం, అక్కడి ప్రైవేట్ హోటల్స్ యాజమాన్యం తమను ప్రసన్నం చేసుకోలేదన్న కారణంగా రోడ్డు వేయకుండా నిలిపివేశారన్న ఆరోపణలు చాలాకాలంగా వున్నాయి. దారిలేకుండా చేస్తే.. దారికొస్తారని కక్ష సాధింపులకు దిగారు.అభివృద్ధి మాటున అరాచకం చేస్తున్న అధికార పార్టీ తీరుతో రెండేళ్లుగా అక్కడి స్థానికులు, వ్యాపారులు నరకం చూస్తున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే యాత్రికులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. శ్రీనివాసం ఎదురుగా గరుడ వారధి ఎక్కే రోడ్డుకు పడమరగా పీకే లేఅవుట్‌కు వెళ్లే ప్రధాన మార్గాలను అడ్డంగా గోతులు తీసి వదిలేశారు. రెండేళ్ల క్రితం తవ్విన గోతులు ఇప్పటివరకు పూడ్చకపోవడంతో హోటళ్లకు వెళ్లే యాత్రికులతోపాటు, ఆటోవాలాలు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. అధికార పార్టీకి చెందిన స్థానిక నేతల ఒత్తిడి వల్లే పనులు త్వరగా చేయడం లేదన్న విమర్శలు కార్పొరేషన్ అధికారులపై ఉన్నాయి. ప్రధానంగా ఇక్కడ నివాసం ఉంటున్నవారు టీడీపీవైపు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు.అధికార పార్టీ పెద్దలకు ఇదే మింగుడు పడకుండా పోయింది. వీరిని ఎలాగైనా దారికి తెచ్చుకుందామని ప్రయత్నించి దారిలేకుండా చేశారు. వ్యాపారులు అప్పటికీ అధికార పార్టీ నేతల బెదిరింపులకు లొంగకపోవడంతో రెండేళ్ల క్రితం తవ్విన గోతులు ఇప్పటివరకు పూడ్చనేలేదు.ఈ విషయమై కమిషనర్ హరితకు స్థానికులతో కలిసి ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు మూడోసారి సోమవారం ఫిర్యాదు చేశారు.వారంలోపు పనులు పూర్తిచేయకుంటే శ్రీనివాసం ఎదురుగా ఆందోళన స్థానికులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్‌ను పిలిచి ఆదేశించారు. కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినవారిలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు, నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర నారాయణ, 11వ డివిజన్ అధ్యక్షుడు గాలి పవన్ చౌదరి, 26వ డివిజన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

న్యాయవాదులకు జనసేన మద్దతు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 22: రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదుల చేస్తున్న నిరసనకు జనసేన మద్దతు ప్రకటించింది. కోర్టు ప్రాంగణంలోని దీక్ష శిబిరానికి సోమవారం తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, తదితరులు వెళ్లి మద్దతు తెలిపారు. జనసైనికులు రాజేష్‌ఆచారి, మనోజ్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దిన వేడుకలు నిర్వహిద్దాం: జేసీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: గణతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని జేసీ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి ఈనెల 26న నిర్వహించే వేడుకల నిర్వహణపై సంబంధించి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లేదంటే సమ్మె బాటే..

రుయా సూపరింటెండెంట్‌కు ఏఐటీయూసీ వినతి



రవిప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి సిటీ, జనవరి 22: రుయాస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెబాట పట్టాల్సి వస్తుందని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి రవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర అన్నారు. ఈ మేరకు సోమవారం సూపరింటెండెంట్ రవిప్రభుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనల మేరకు జీతాలు ఇవ్వకపోగా పనిభారం మోపి.. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని చెప్పారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లు కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే ఈనెల 24, 25 తేదీల్లో కార్మికులతో కలిసి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా చేస్తారన్నారు. ఆ తర్వాత విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళతారని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ నేతలు పార్వతి, జ్యోతి, లత తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 22: బైరాగిపట్టెడలోని వైఖాసన (ఆశ్రమం) కల్యాణ వేదికలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి బ్రాహ్మణ సమాజం నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు.700మంది హాజరయ్యారని చెప్పారు. సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, కన్వీనర్లు నరసింహాచార్య, వేదం హరిప్రసాద్, వెంకటరామరాజు, కామేశ్వర ప్రసాద్, ఎంఎస్‌కే ప్రసాద్, రామశర్మ, గంగాధర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

టీడీఆర్ బాండ్ల గోల్‌మాల్‌పై విచారణ జరిపిస్తాం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 22: సీఎం జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అనుభవం లేని పాలన వల్ల రాష్ట్రం తిరోగమనంలో ఉందన్నారు. అందుకే రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ధర్నాలు జరుగుతున్నాయని చెప్పారు. రాయలసీమ రైతుల ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వం వస్తే కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి.. ఇన్నేళ్లయినా ఎందుకు చేయలేదో జవాబు చెప్పాలన్నారు. టీడీఆర్ బాండ్లలో గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. దీనిపై రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో విచారణ చేయిస్తామని స్పష్టం చేశారు. స్మార్ట్‌సిటీ నిధుల కింద యూడీఎస్‌కు ఇచ్చిన రూ.200కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డు విషయంలో రెండు గ్రామాలకు తగాదాలు తెచ్చేలా అధికారులు, పాలకుల చర్యలు ఉన్నాయని వాపోయారు. టీడీపీ, జనసేన పొత్తును ప్రజలు బలపరచాలని కోరారు. ఈ సమావేశంలో సూరా సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, ఊట్ల సురేంద్ర నాయుడు, కంకణాల రజనీకాంత్ నాయుడు, కరాటే చంద్ర పాల్గొన్నారు.

ఒరిగిన పొక్లెయినర్ : స్తంభించిన ట్రాఫిక్





తిరుపతి(కొర్లగుంట), జనవరి 22: కపిలతీర్థం-అలిపిరి మార్గంలో ఓ పొక్లెయినర్ ట్రాలీ నుంచి రోడ్డుమీదకు దించుతుండగా పక్కకు ఒరిగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ మార్గంలో బస్సు పట్టే స్థలమే మిగలడం.. దాదాపు గంటసేపు అలాగే ఉండటంతో ఈ మార్గంలో దాదాపు కిలోమీటరు వరకు వాహనాలు బారులుతీరాయి. ఈ సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను వరుసక్రమంలో అనుమతించారు. కొంత సమయానికి నిపుణులు వచ్చి పొక్లెయినర్‌ను పక్కకు తొలగించి.. ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జయంతి

తిరుపతి (కల్చరల్), జనవరి 22: తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను రాగి రేకుల నుంచి సంగ్రహించి, పరిష్కరించి గ్రంథస్తం చేయడంలో విశేషంగా కృషిచేసిన సంగీత, సాహిత్య విద్వాంసుడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జయంతిని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం ఆరు గంటలకు అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూధార్మిక సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయని పేర్కొంది.

చంద్రగిరిలో 39వేల దొంగ ఓట్లు చేర్చారు

● టీడీపీ నాయకురాలు సుధారెడ్డి ఆరోపణ

● దొంగ ఎపిక్ కార్డులను సృష్టించిన వారందరిపై చర్యలేవీ?: నరసింహయాదవ్



ఆర్డీవో నిశాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న నరసింహయాదవ్, సుధారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: చంద్రగిరి నియోజకవర్గంలో 39వేల దొంగ ఓట్లు చేర్చారని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆరోపించారు. కలెక్టరేట్‌లో ఓటర్ల తుదిజాబితాపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షించారు. ఈ సమావేశానికి టీడీపీ, బీజేపీతోపాటు పలుపార్టీల నాయకులు విచ్చేశారు. సమావేశం అనంతరం టీడీపీ నాయకురాలు సుధారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది ఓటర్ల జాబితాలో 2.90లక్షలు చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లు ఉండగా ఈ ఏడాది ప్రకటించిన తుది జాబితాలో 3.09లక్షలకు చేరిందన్నారు. తమ ఫిర్యాదులు, అభ్యంతరాలతో 18వేలకుపైగా ఓట్లను తొలగించినట్లు సాక్షాత్తూ ఆర్డీవోనే ప్రకటించారని చెప్పారు. ఈలెక్కన సుమారు 39వేల దొంగ ఓట్లను అధికార పార్టీ చేర్పించిందని అర్థమవుతోందన్నారు. విడ్డూరం ఏమిటంటే.. 40 ఏళ్ల పైబడి 80 ఏళ్లలోపున్న 6వేలమంది కొత్త ఓటర్లను చేర్చారని.. ఇన్ని సంవత్సరాల్లో వారికి ఎక్కడా ఓటు లేదా? ఇవన్నీ దొంగ ఓట్లు కావా అని ప్రశ్నించారు. చంద్రగిరి ఎన్నికల అధికారుల లాగిన్‌పై సాంకేతిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ.. 35వేల దొంగ ఎపిక్ కార్డుల విషయంలో అధికారులను సస్పెండ్ చేశారని, అయితే వీటిని సృష్టించిన నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మిగిలినవారిపైనా చర్యలు తీసుకుని, అసలు సూత్రధారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడికొచ్చిన ఆర్డీవోతోనూ నాయకులు మాట్లాడారు. జాబితాలో ఫొటోలు గతంలోలా స్పష్టంగా కనిపించేలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ ఆచారి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి అర్బన్, జనవరి 22: మూడు ప్రాంతాల్లో నిర్వహించిన కూంబింగ్‌లో 20 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. రెండు వాహనాలసహా 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం టాస్క్‌ఫోర్సు డీఎస్పీ మురళీధర్ మీడియాకు తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలమేరకు అన్నమయ్య జిల్లాలోని రాజంపేటకు చెందిన ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందాలు కూంబింగ్ చేస్తుండగా.. సుండుపల్లి మండలం సానిపాయ రేంజ్‌లో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపారు. వీరిని చూసి వాహనంలోని వారు పరారయ్యారు. వెంబడించి, బెంగళూరుకు చెందిన సయ్యద్ నౌషద్(28)ను పట్టుకుని ఐదు ఎర్రచందనం దుంగలను, కారును సీజ్ చేశారు. అలాగే ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడి బృందాలు రాజంపేట రేంజ్ ఎస్ఆర్‌పాళెం సెక్షన్ పరిధిలోని పుట్టంగి మడుగు వద్ద కూంబింగ్ నిర్వహిస్తుండగా.. కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయే ప్రయత్నం చేశారు. వీరిలో తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ఏలుమలై కుప్పుస్వామి(28)ని పట్టుకున్నారు. సంఘటనా స్థలం నుంచి ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇక రైల్వేకోడూరుకు చెందిన ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐలు రాఘవేంద్ర, విశ్వనాథ్‌లు నెల్లూరు జిల్లా రాజుపాళెం బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. వెంకటరామరాజుపేట వద్ద కొందరు టెంపో ట్రావెలర్ దిగుతుండగా చుట్టుముట్టి తనిఖీ చేశారు. వారి వద్ద ఎనిమిది ఇనుప గొడ్డళ్లు, మడత పెట్టిన రంపాలను గుర్తించడంతో స్మగ్లర్లుగా నిర్ధారించుకుని 18 మందిని అరెస్టు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. వీరిలో.. తమిళనాడుకుచెందిన శేఖర్ వెలకాని(41), దశ్యన వెలకాని(33), ప్రకాష్ చిన్నపయ్య(43), అశోక్(33), పొన్నుస్వామి చిన్నప్పయన్(43), సంపత్ దక్షిణామూర్తి(19), సుందరేశన్ సూర్యన్(24), రాజువేలు సూర్యన్(29), రాజేంద్రన్‌చిన్నస్వామి(39), చిన్నస్వామి రాజి(64), చంద్రన్ సడమన్(49), విజయకుమార్(43), మురుగన్ పొన్నుస్వామి (44), విజయకుమార్ ముత్తు (35), రామన్ చిన్నపయ్యన్(39), సౌందర్ మణి(21) కుప్పుస్వామి అప్పస్వామి(39), నెల్లూరుకు చెందిన నక్కన మహేష్‌రెడ్డి ఉన్నారు. ఈ కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాయలంలో నమోదుచేసి ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. పరారైన వారికోసం స్పెషల్ టీమ్‌లతో కూంబింగ్ కొనసాగిస్తున్న డీఎస్పీ మురళీధర్ తెలిపారు.

అభ్యంతరాలు, ఫిర్యాదులపై స్పందన ఏదీ..?

వరదయ్యపాళెం, జనవరి 22: మృతి చెందినవారు, మరో ఊరికి వలస వెళ్లినవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని, పలు గ్రామాలో పోలింగ్ బూత్‌ల మార్పుచేయాలని పదేపదే చెబుతున్నా ఎందుకు పట్టించుకోలేదని అఖిల పక్షం నాయకులు ప్రశ్నించారు. వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంత రాలపై తహసీల్దారు గౌరీశంకర్ అఖిలపక్షం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణయ్య, టీడీపీ నాయ కులు నరసరాజు, ఆదిశేషు, సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు సిద్ధులయ్య మాట్లాడుతూ తమ అభ్యంతరాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. తహ సీల్దారు మాట్లాడుతూ గతంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి మృతి చెందినవారి ఓట్లు తొలగించామన్నారు. తాజా జాబితాలో అభ్యంతరాలుంటే చర్యలు తీసుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నార

ఊరూరా అయోధ్య రాముడికి పూజలు



పల్లమాలలో కోలాటం వేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పల్లమాల కోందడరాముని ఆలయంలో సోమవారం సీతా, రామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలభిషేకాలు చేశారు. భక్త బృందం కోలాటాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల నగరోత్సవం



శ్రీకాళహస్తి, జనవరి 22: సీతారాముల నగరోత్సవం సోమవారం శ్రీకాళహస్తిలో వేడుకగా జరిగింది. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా పట్టణంలోని నెహ్రూ వీధిలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తజన సందోహం మధ్య సీతారాములను చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అయోధ్య నుంచి విచ్చేసిన శ్రీరామ పూజిత అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సత్యవేడు మండల సమావేశం

సత్యవేడు, జనవరి 22: సత్యవేడులో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ విజయలక్ష్మి హాజరయ్యారు. సమా వేశంలో అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. అధికారుల నివేది కలను ప్రజా ప్రతినిధులు వినడానికే పరిమితమయ్యారు. కాగా తమ గ్రామంలో పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, ఆక్రమణదారుల నుంచి పాఠశాల స్థలాన్ని రక్షించాలని దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొత్తమారికుప్పం ఎంపీటీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అమావాస్యరెడ్డి కండ్రిగ నుంచి ముసల్రాజుకండ్రిగ వరకు నిర్మించవలసిన సీసీ రోడ్డు పనిని కాంట్రాక్టర్ అర్ధాంతరంగా ఆపేశాడని పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రామనామ స్మరణతో మార్మోగిన శ్రీసిటీ



శ్రీసిటీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

శ్రీసిటీ, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీసిటీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం వేడుకగా నిర్వహించారు. సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమ సమేత రాములవారి విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా శ్రీరామరక్ష హోమం జరిపారు. పరిసర గ్రామస్థులతో పాటు శ్రీసిటీలోని చిన్మయ, అకార్డ స్కూళ్లు, ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



శ్రీకాళహస్తి, జనవరి 22: సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. అయోధ్యలో రామ మందిర కుంభాభిషేకం పురస్కరించుకుని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి తన స్వగ్రామం ఊరందూరులో సీతారాముల కల్యాణం జరిపించారు. సోమవారం సుధీర్ రెడ్డి దంపతులు తమ ఇంటి నుంచి సీతారాములకు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మార్మోగిన రామనామం

కేవీబీపురం, జనవరి22: మండలంలో వాడవాడలా రామ నామం మార్మోగింది. అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో పూజలు చేశారు.

అయోధ్య రాముడికి నీరాజనం



జైశ్రీరామ్ రూపంలో కూర్చున్న నైస్ పాఠశాల విద్యార్థులు

వరదయ్యపాళెం, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలంలో పలుచోట్ల శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేశారు. లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య ప్రాణ ప్రతిష్ఠను ప్రత్యక్షప్రసారం చేశారు. నైస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు జైశ్రీరామ్ అక్షర రూపంలో కూర్చున్నారు.

మా సమస్యలు పరిష్కరించేదెప్పుడు?

అధికారుల ఎదుట బాధితుల ఆవేదన ● కలెక్టరేట్‌లో 'స్పందన'కు 96 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22: కలెక్టరేట్‌కు వారం.. వారం తిరుగుతూనే ఉన్నా.. తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అధికారుల ఎదుట బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు అర్జీదారులు పెద్దఎత్తున విచ్చేసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మొత్తం 96 అర్జీలు అందాయి. వీటిల్లో 75 అర్జీలు వరకు భూసమస్యలపైనే ఉన్నాయి. ఈ అర్జీలను నిర్లక్ష్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఇతర అధికారులు స్వీకరించారు.



డీఆర్వోను చుట్టుముట్టిన తారకరామానగర్‌వాసులు

పరిహారమివ్వలేదు



మా గ్రామానికి చెందిన భూములను జగనన్న కాలనీకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా పరిహారం ఇవ్వలేదు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇకనైనా న్యాయం చేయండి.

- చెంచయ్య, రైతు, చిందేపల్లె, ఏర్పేడు మండలం

ఇంటి స్థలం ఇప్పించండి



మేము కూలీనాలి చేసుకుంటాం. ఉండటానికి ఇల్లులేదు. ప్రభుత్వ ఇంటి స్థలం కోసం కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాం. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించండి.

- రత్నమ్మ, తారకరామనగర్‌కాలనీ, రేణిగుంట

ఇంటి స్థలాల కోసం కలెక్టరేట్‌ను ముట్టడించిన తారకరామనగర్‌వాసులు

పట్టాలిచ్చి.. ఇంటి స్థలాలు చూపలేదంటూ కొందరు, తమకు ఇంటి స్థలం కావాలంటూ మరికొందరు సుమారు 400మంది వరకు రేణిగుంట మండలం తారకరామానగర్‌వాసులు, పరిసర ప్రాంతాలవారు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఏర్పేడు పాగాలి వద్ద జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చినా, అది కోర్టు పరిధిలో ఉందని చెబుతున్నారన్నారు. అటువంటప్పుడు తమకు పట్టాలు ఎందుకు ఇచ్చారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కరకంబాడి వంటి ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాదాపు గంటన్నరకుపైగా బైఠాయించడంతో డీఆర్వో పెంచలకిషోర్ వచ్చి వారికి నచ్చచెప్పారు. అలాగే పోలీసులొచ్చి సర్దుబాటు చేసి పంపారు.

పోలీసు 'స్పందన'కు 70 అర్జీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 70 అర్జీలు అందాయి. ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారితో కలిసి బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ పరమేశ్వరరెడ్డి స్వీకరించారు. అనంతరం సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, ఆస్తి తగాదాలు తదితర సమస్యలపై అర్జీలు అందాయి.

ప్రజల కష్టాలు తీరాలంటే చంద్రబాబు సీఎం కావాలి



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 22: ప్రజల కష్టాలు తీరాలంటే చంద్రబాబునాయుడు మళ్లీ సీఎం కావాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గాలి జీవరత్నంనాయుడు అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ఎన్జీవో కాలనీ బూత్ నెంబర్ 66లో యూనిట్ ఇన్‌చార్జి ఎల్లంటి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్నట్లు ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై స్థానికులకు అవగాహన కలిగించారు. అలాగే ఇంటింటి రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్ఎన్ ధనపాల్, బూత్ ఇన్‌చార్జి మునస్వామి యాదవ్, బీదీ రమణ, వెంకటాద్రి, గోవర్ధన్, శారదమ్మ, షర్మిల, ధనలక్ష్మి, సుబ్బరత్నమ్మ, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం



కోనేటి రవిరాజు, బొడ్డులూరి బాబు

పుత్తూరు అర్బన్, జనవరి 22: ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా కోనేటి రవిరాజు, అధ్యక్షుడిగా బొడ్డులూరు బాబు, జనరల్ సెక్రటరీగా రామ్మోహన్ వర్మ, ట్రెజరర్‌గా లోకనాథంనాయుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి రవిరాజు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన ఉదయం 9 గంటలకు నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్‌తో పాటు అన్ని రకాల జబ్బులకు, చెవి, కన్ను, దంత సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే రిపబ్లిక్ డే సందర్భంగా రక్తదాన శిబిరాన్ని సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబునాయుడు, మురళి, లోకనాథ నాయుడు, ప్రసాదరావు, కుప్పయ్య, విజయకుమార్, అన్నయ్య పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పుత్తూరు అర్బన్, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం గేటు పుత్తూరులో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు, మండల అధ్యక్షుడు శ్రీధర్, వడమాలపేట అధ్యక్షుడు జగదీష్, నియోజకవర్గ కో కన్వీనర్ సుబ్రహ్మణ్యంరాజు, మునస్వామి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

పుత్తూరు అర్బన్, జనవరి 22: మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణ పరిధిలోని శ్మశాన వాటికలో నిర్మిస్తున్న విద్యుత్ దహన యంత్రం పనులను, మొదటి వార్డు పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురం, ఐదవ వార్డు పరిధిలోని పిళ్లారిపట్టులో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో



కేఎన్ రోడ్డులో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 22: అంగన్వాడీల అక్రమంగా అరెస్ట్‌కు నిరశనగా సోమవారం పట్టణంలోని కేఎన్ రోడ్డు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా వెళుతున్న అంగన్వాడీలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలపై అణచివేత ధోరణితో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమ్మె పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

శ్రీరాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



శ్రీరాముడికి పూజలు చేస్తున్న అశోకరాజు, కళాశాల సిబ్బంది

నారాయణవనం, జనవరి 22: శ్రీరాముడి జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శ్రీరాముడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోకరాజు మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటూ శ్రీరాముడు ప్రజలకు ఆదర్శవాదిగా నిలిచారని అన్నారు. అనంతరం విద్యార్థులందరూ జై శ్రీరాం, జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు: పట్టణంలోని కోదండరామాలయం, ఆజంనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. సోమవారం ఉదయం కోదండరామాలయంలో అభిషేకాలు చేశారు. సాయంత్రం శోభా యాత్ర నిర్వహించారు. అలాగే ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర రావు, విక్కీరాయల్, కోటకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: స్థానిక సంజీవరాయ ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సీతారాముల ఉత్సవ మూర్తులకు అభిషేకం చేసి పట్టుపీతాంబరాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు శివ, సాయి వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామాల నడుమ మాంగళ్యధారణ చేయించారు. సాయంత్రం వడమాలపేట, తిరుమణ్యం, రాజులకండ్రిగ, ఎస్‌బీఆర్ పురం గ్రామాల్లో సీతరాముల ఊరేగింపు జరిగింది.





పుత్తూరులో శోభా యాత్ర - వడమాలపేటలో సీతారాముల కల్యాణోత్సవం

జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

తిరుపతి (రవాణా), జనవరి 22: తిరుపతి నుంచి పుత్తూరు తిరువళ్లూరు మీదుగా చెన్నై వెళ్లే జాతీయ రహదారి (205) విస్తరణకు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి నుంచి పుత్తూరు, తిరువళ్లూరు మీదుగా చెన్నై వెళ్లే జాతీయ రహదారి, అలాగే తిరువళ్లూరు నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు వరకు ఒక ప్యాకేజీ కింద 43.950కి.మీ. చొప్పున నిడివితో రూ.756.82కోట్లు, తమిళనాడు సరిహద్దు నుంచి పుత్తూరు వరకు 20.030కి.మీ నిడివి గల రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు, మల్లవరం నుంచి రేణిగుంట వరకు 17.40కి.మీ. నిడివిగల నాలుగులేన్ల రహదారిని ఆరులేన్లుగా, మల్లవరం నుంచి ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు వరకు 37.43కి.మీ నిడివి కల్గిన మార్గానికి రూ.775.72కోట్లతో జాతీయ రహదారుల సంస్థ టెండర్లకు ఆహ్వానం పలికినట్లు ఎంపీ వివరించారు. తిరుమలకు నిత్యం తమిళనాడులోని తిరువళ్లూరు-పుత్తూరు మార్గంలో సుమారు 20వేలమంది భక్తులు ప్రయాణిస్తుంటారు. అలాగే తిరుపతి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో వ్యాపార నిమిత్తం చెన్నై నగరానికి పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారని కేంద్రమంత్రికి ఎంపీ వివరించారు.

ఘనంగా రామాయణ పారాయణం

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తిరుమల ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ వాల్మీకి రామాయణ పారాయణం ఘనంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ సమేత రాముడు, హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండలు కలిపి 20 వేలకుపైగా శ్లోకాలను పారాయణం చేశారు. అలాగే యాగశాలలో వేద విద్యార్థులతో ఏడు వేదశాఖల సంపూర్ణ మూలపారాయణం చేపట్టారు. వీటితోపాటు ఆనందనిలయంలో ప్రబంధ, ఆగమ విద్యార్థులతో సీతారామ మంత్రానుష్టానం, కార్యాలయంలోని హాల్‌లో స్మార్త విద్యార్థులతో లక్షణ, హనుమ మంత్రానుష్టానం చేశారు. ఈకార్యక్రమంలో వేదపాఠశాల ప్రిన్సిపాల్ అవధాని, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వైసీపీని అంతం చేయడానికి ప్రజలు సిద్ధం: జనసేన




తొట్టంబేడు, జనవరి 22: వైసీపీని అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత తెలియజేశారు. మండలంలోని చోడవరం పంచా యతీలో జనసేన విజయ యాత్ర.. ఏపీ నీడ్స్ పవన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొట్టం బేడు మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్రశేఖర్ నాయకులు కావలి శివకుమార్, గణేష్, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి, కవిత, నాథముని, శారద రాజ్యలక్ష్మి, దినేష్, సురేష్, రాజేష్, మునెయ్య, జనసైనికులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

తొట్టంబేడు, జనవరి 22: మండలంలోని పూడి దళితవాడకు చెందిన మునెయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆయన అంత్యక్రియల కోసం స్థానిక నాయకురాలు రెడ్డెమ్మ ద్వారా ఆ కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి రూ.10వేలు అందజేశారు.

భక్తకన్నప్పకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భక్తకన్నప్ప మూర్తికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భక్త కన్నప్ప నిష్కల్మష భక్తికి మెచ్చిన పరమశివుడు ముక్తిని ప్రసాదించిన రోజును ఘనంగా నిర్వహించారు. వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. భక్త కన్నప్ప మూర్తిని విశేషంగా అలంకరించి ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తకన్నప్పను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు పాల్గొన్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సిపాయి భరోసా పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 22: శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగలో ఇటీవల మృతి చెందిన ఆదెమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ధైర్యం చెప్పారు. ఆదెమ్మ కర్మక్రియలు సోమవారం జరిగాయి. హాజరైన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. 41 రకాల నిత్యా వసర సరుకులను అందజేశారు. తాను ఎప్పుడూ పేదలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రత్నం రెడ్డి, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

విడిది నిర్మాణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, జనవరి 22: భక్తుల బస కోసం చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులను సోమవారం ముక్కంటి ఆలయ అధికారులు పరిశీలించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు, ఈఈ నూకరత్నం సంయుక్తంగా రెండవ గేటు సమీపంలో పర్యటించారు. మహాశివరాత్రి ఉత్సవాలలోగా షెడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌రెడ్డి, జైశివకుమార్, వర్క్ ఇన్స్పెక్టర్లు బాలాజీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కులగణనకు హాజరు కాని ఉద్యోగిపై ఫిర్యాదు

వరదయ్యపాళెం, జనవరి 22: కులగణన సర్వేలో పాల్గొనని సచివాలయ ఉద్యోగిపై చర్యలకు ఎంపీడీవో లేఖరాశారు. వరదయ్యపాళెం సచివాలయంలో విద్యుత్ శాఖ ఎనర్జీ సహాయకుడు చెంగయ్యను కులగణన సర్వే బృందంలో నియమించారు. అయితే ఇప్పటివరకు ఆయన హాజరు కాలేదు. దీనిపై ఈవోపీఆర్డీ బసిరెడ్డి ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన చెంగయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో, జేసీకి ఫిర్యాదు చేశారు.

వన్ టౌన్ సీఐగా నరసింహారావు



శ్రీకాళహస్తి, జనవరి 22: శ్రీకాళహస్తి 1టౌన్ సీఐగా నరసింహారావు నియమితుల య్యారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన అనంతపురం వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా సోమవారం శ్రీకాళహస్తి నుంచి సీఐ అంజుయాదవ్ రిలీవ్ అయ్యారు.

ఎస్ఐ రాఘవేంద్రకు సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 22: తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్రను శ్రీకాళహస్తి గౌడ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. గత నెలలో గుండ్లమడుగు వాగులో చిక్కుకుపోయిన కారా కొల్లు గ్రామానికి చెందిన చిన్న బత్తయ్యనాయుడు, ఆయన సతీమణి నాగరత్నమ్మను ఎస్ఐ రాఘవేంద్ర సురక్షితంగా రక్షించారు. దీనిపై అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి ఎస్ఐ రాఘవేంద్రరావు అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ క్రమంలో గౌడ్ సంఘం నాయకులు ఎస్ఐ రాఘవేంద్రను శాలువలతో సత్కరించి ముక్కంటి ఆలయ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ గౌడ్, పురుషోత్తం గౌడ్, శ్రీరాములు గౌడ్, వేణు, మునిశేఖర్, భాస్కర్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

శ్రీకాళహస్తి, జనవరి 22: మహాశివరాత్రి ఉత్సవాలపై శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో రామారావు సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 7వ తేదీన మహాశివరాత్రి పర్వదినం రానుంది. మొత్తం 13 రోజుల పాటు ఉత్సవాలు జరు గుతాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో ఒకరి ఆత్మహత్య

రేణిగుంట,జనవరి22: రేణిగుంట మండలం కరకంబాడి గొల్లపల్లి గ్రామంలో ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. గొల్లపల్లిగ్రామానికి చెందిన మునిక్రిష్ణారెడ్డి రెండవ కుమారుడు రాజశేఖర్‌రెడ్డి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

శ్రీకాళహస్తి, జనవరి 22: ముక్కంటి ఆలయ రెండో గేటు వద్ద ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

కన్నప్పను దర్శించుకున్న సూర్య ఆధీనం పీఠాధిపతి

శ్రీకాళహస్తి, జనవరి 22: తమిళనాడులోని సూర్య ఆధీనం పీఠాధిపతి గణేష్ స్వామిగళ్ సోమవారం భక్తకన్నప్పను దర్శించుకున్నారు. భక్తకన్నప్ప ముక్తి పొందిన రోజు కావడంతో సోమవారం పీఠాధిపతి గణేష్ స్వామిగళ్ శ్రీకాళహస్తికి విచ్చేశారు. ఆలయ ఈవో రామారావు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు.

వీధికి నామకరణం

శ్రీకాళహస్తి, జనవరి 22: శ్రీకాళహస్తిలోని మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న సందుకు గణపతివీధిగా నామకరణం చేశారు. అయోధ్య రామ మందిరంలో కుంభాభిషేకం పురస్కరించుకుని సోమవారం స్థానికులు నామకరణం చేశారు. పేదలకు అన్నదానంచేశారు.

తేనెమంచు పురుగును నివారించవచ్చు

రేణిగుంట, జనవరి22: ప్రస్తుత మంచుకాలంలో మామిడిలో తేనె మంచుపురుగును జీవసంబంధిత మందులతో నివారించ వచ్చునని రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం రాస్ కేవీకేలో మామిడిరైతులకు తేనెమంచు పురుగు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జీవసంబంధిత మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధాకర్, పులిచెర్ల, చిన్నగొట్టిగల్లు మండలాల రైతులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా నవీన్

శ్రీకాళహస్తి, జనవరి 22: కాపు సంక్షేమ సేన శ్రీకాళహస్తి అధ్యక్షుడిగా నవీన్ కుమార్‌ను ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడు సోమవారం నవీన్ కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. రాధా, రంగా మిత్రమండలి నియోజకవర్గ అధ్యక్షులు సిద్ధులు గారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేయండి



శ్రీకాళహస్తి, జనవరి 22: శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు సోమవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంకు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు

తొట్టంబేడు, జనవరి 22: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు కొత్తపేట లోని వారి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షులుగా జయశంకర్, గౌరవ అధ్య క్షులుగా గురవారెడ్డి, సలహాదారులుగా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా దేవీశ్రీ ప్రసాద్, కార్యదర్శిగా సాయిరెడ్డి, మిగతా కార్యవర్గాన్ని, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిరంకుశ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి



శ్రీకాళహస్తిలో నిరసన ప్రదర్శిస్తున్న అంగన్వాడీలు

శ్రీకాళహస్తి, జనవరి 22: విజయవాడలో అంగన్వాడీల అరెస్టుపై కార్మిక సంఘాల నాయకులు మండి పడ్డారు. అంగన్వాడీ నాయకుల అరెస్టులు, నిర్బంధానికి వ్యతిరేకంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరులో మార్పురాకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య, మించిల శివకుమార్, గోపి, సీఐటీయూ నాయకులు వెంకటేష్, సంక్రాంతి వెంకటయ్య, గురునాథం, అన్వర్ బాషా, ఈశ్వరయ్య పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని సమ్మె అంగన్వాడీలు

పిచ్చాటూరు, జనవరి 22: పిచ్చాటూరులో అంగన్వాడీలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలువురు అంగన్వాడీలు విజయవాడకు తరలివెళ్లారు. అనారోగ్యం, వయసు రీత్యా వెళ్లలేని కొందరు సమ్మె కొనసాగించారు. కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే ఒక్క ఆయా..!

రేణిగుంట, జనవరి22: రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒకే ఒక ఆయా విధుల్లో చేరారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు, ఆయాలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం చలో విజయవాడ నేపథ్యంలో విధుల్లో చేరని వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే రేణిగుంట ఐసీడీఎస్ పరిధిలోని 218 మంది అంగన్వాడీలు ఉండగా తూకివాకంలో ఒకే ఒక ఆయా విధుల్లో చేరారని సీడీపీవో కృష్ణమంజరి తెలిపారు. కాగా సీపీఎం నాయకులు అంగన్వాడీల అరెస్టుకు నిరసనగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఉద్యోగం నుంచి తొలగిం చాలని జీఓ విడుదల చేయడంపై వారు మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి త్వరలో గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

అంగన్వాడీ వర్కర్ల అరెస్ట్



నాగలాపురం పోలీస్ స్టేషన్ వద్ద అంగన్ వాడీ వర్కర్లు

నాగలాపురం, జనవరి 22: నాగలాపురం మండల అంగన్వాడీ వర్కర్లను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. చలో విజయవాడకు బయలుదేరి ఓ ప్రైవేట్ వ్యానులో వెళ్తుండగా మార్గ మధ్యంలో గూడూరు పోలీస్ తనిఖీకేంద్రం వద్ద గూడూరు పోలీసులు అడ్డుకున్నారు. వారిని గూడూరు పోలీస్ స్టేసన్‌కు తరలించి నాగలాపురం పోలీసులకు అప్పగించారు. నాగలాపురం ఎస్ఐ ఓబయ్య ఆధ్వర్యంలో సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి తర్వాత విడిచి పెట్టారు. అంతేగాక అంగన్వాడీలు ప్రయాణించిన ప్రైవేట్ వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

భారీగా టీడీపీలోకి వలసలు



ఏర్పేడు, జనవరి 22: ఏర్పేడు మండలం పాపానాయుడుపేట, మర్రిమంద గ్రామం నుంచి సుమారు 70 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో సోమవారం చేరారు. ఊరందూరు గ్రామంలో కేశవులు, మునిరెడ్డి, సీతాపతి ఆచారి, రవికుమార్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. చేరినవారిలో మర్రిమంద గ్రామం నుంచి 50 కుటుంబాల వారు, పాపానాయుడుపేట నుంచి 20 కుటుంబాల వారు ఉన్నారు.

ప్రచార రథం అడ్డగింత హేయం



కృష్ణ యాదవ్

శ్రీకాళహస్తి, జనవరి 22: టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ అరాచక శక్తులు అడ్డుకోవడం హేయనీయం అని తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు డాక్టర్ కృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాల యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ బొజ్జల రిషితారెడ్డి ప్రచారం చేస్తుండగా అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి టీడీపీ నేతలను వేధించడం మానుకొని అభివృద్ధిపై దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారని హితువు పలికారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయండి



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 22: రైతులు సాగు చేసుకుంటున్న అనాధీనం భూములకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసిరాజన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని చుక్కల నిడిగల్లు, రామాపురం, వాగేడు, ముచ్చువోలు గ్రామాల్లో ఎందరో రైతులు 30 ఏళ్ల నుంచి అనాధీనం భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వారకి పట్టాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన పేదలకు గ్రామాల్లో ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా ..డ్రైవర్ మృతి



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 22: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని వేణుగోపాలపురంలో జరిగింది. పోలీసుల కంథనం మేరకు.. కుమార వెంకటాపురం గ్రామానికి చెందిన పాలేటి వెంకటయ్య (43) వేణుగోపాలపురం గ్రామానికి చెందిన రైతు గురప్పనాయుడు పొలంలో రాళ్ల తరలించడానికి వెళ్లాడు. పొలం నుంచి బండరాళ్లను తరలించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడింది. వెంకటయ్య ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నుంచి కిందపడి విద్యార్థి మృతి



మృతి చెందిన దివాకర్

సత్యవేడు, జనవరి 22: బస్సులో నుంచి అదుపు తప్పి కింద పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన సత్యవేడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని సిరుణంబుదూరుకు చెందిన శేఖర్ కుమారుడు దివాకర్(17) నాగలాపురంలోని ఒక ప్రైవేటు ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లేందుకు ఓ ప్రైవేటు బస్సు ఎక్కాడు. మార్గమధ్యంలో చెన్నేరి వద్ద ప్రయాణికులు దిగిన తరువాత తిరిగి బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా ఫుట్‌పాత్‌పై అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్‌లు



శ్రీసిటీ, జనవరి 22: భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కి చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్) సతీష్ కామత్ వీరికి స్వాగతం పలికారు. శ్రీసిటీమౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం బాగుందని ట్రైనీ ఐఏఎస్‌లు కితాబిచ్చారు. వీరి పర్యటన పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

రేణిగుంటలో శ్రీరాముడి చిత్రపటం ఊరేగింపు



రేణిగుంట, జనవరి22: రేణిగుంటలో రాజస్థానీయులు శ్రీరాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. రాజస్థాన్ మిత్రమండలి శ్యాంచంద్ గెహ్లాట్ ఆధ్వర్యంలో బజారువీధిలో నుంచి భజనగుడివీధిలోని రామాలయం వరకు ఊరేగింపు సాగింది. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో నేమీచంద్ గెహ్లాట్, సంపత్‌రాజ్, జైన్‌రాజ్, నరేందర్‌జైన్, ఓంప్రకాష్, రాజేందర్, ప్రియాంక, మునిదేవి, కమల తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం



శ్రీకాళహస్తిలో శోభాయాత్రలో కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి జనవరి 22: రామదాసు కీర్తించినట్లుగా సోమవారం శ్రీకాళహస్తి అంతా రామమయంగా తలపించింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకొని వాడవాడలా రామనామం మార్మోగింది. శ్రీకాళహస్తిలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో వైభవంగా అయోధ్య శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో శ్రీరాముని చిత్రపటంతో ఆంజనేయస్వామి కాషాయ జయ కేతనాలను చేతబట్టి బీజేపీ శ్రేణులు జైశ్రీరామ్ నినాదాలతో యాత్ర సాగించారు. చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలతో చతుర్మాడ వీధుల్లో శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. కొందరు ముస్లింలు సైతం శోభాయాత్రలో ఉత్సాహంగా చిందేశారు. ఇక పట్టణం, మండలంలో వాడవాడలా హిందూ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. శ్రీరామ భజన మందిరాల వద్ద అన్నదానాలు చేశారు. ముక్కంటి ఆలయ ఆవరణంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అయోధ్య నుంచి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. సాయం సంధ్య వేళ ప్రతి ఇంటా దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టత్తూరులో శోభాయాత్ర

తొట్టంబేడు: మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో శ్రీరాముడి మహాశోభాయాత్ర చేపట్టారు. కోలా ఆనంద్ పాల్గొన్నారు. అలాగే సాంబయ్య పాళెంలోని రామాలయంలో జైశ్రీరామ్ పేరుతో దీపాలను వెలిగించారు. బీజేపీ నాయకులు కిషోర్‌రెడ్డి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలో సీతరామ లక్ష్మణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు బీజేపీ మండల అధ్యక్షుడు ఆనందనాయుడు, ఆలయ ధర్మకర్త జ్యోతిరాజులు అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

జై శ్రీరాం.. జై శ్రీరాం



సత్యవేడులో శ్రీరాముడి చిత్రపటం ఊరేగింపు

సత్యవేడు, జనవరి 22: అయోధ్య రామాలయంలో రామయ్య ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బీజేపీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి భజన, కోలాటాలతో పట్టణంలో శ్రీరాముడి చిత్ర పటాన్ని ఊరేగించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వైదేహి కల్యాణ మండపంలోని రామాలయం వద్ద అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మునిప్రతాప్, మునికృష్ణ, వాసు, మురళీకృష్ణ, నరేంద్ర, మోహన్ బాబు, వెంకటేశ్వరులురెడ్డి, జ్ఞానశేఖర్, మంజుల రమేష్, మంజు బాలాజీ, శిరీష హేమేంద్ర, రవికుమార్, బాల సుబ్రహ్మణ్యం, వికితా సోమశేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామంలో సోమవారం ఘనంగా శ్రీరాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలా శ్రీరాముడి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అంజిమేడులోనూ శ్రీరాము డికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ ఆదూరు శంకర్‌రెడ్డి, మహేశ్వరి, బిల్వారెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.